క్లుప్తంగా

కిశోరి బాలికలకు పౌష్టికాహారం



పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

బలిజిపేట: వెంగళరాయపురంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద కిశోరి బాలికలకు సర్పంచ్ లక్ష్మి పౌష్టికాహారాన్ని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 14 నుంచి 18 సంవత్సరాల్లోపు కిశోరి బాలికలకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. తద్వారానే ఆరోగ్యంగా ఉండగలరన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్కలంగా విత్తనాలు



పెదబోగిలి రైతు భరోసా కేంద్రంలో విత్తనాలు

సీతానగరం: రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైనన్ని వరి విత్తనాలు, ఎరువులు ఉన్నాయని, పంపిణీ చేయడం జరుగుతోందని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఆర్‌బీకేల్లో వరి విత్తనాలు, ఎరువుల నిల్వలను శనివారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సిద్ధం కావాలన్నారు. విత్తనాలు, ఎరువులు కావాల్సిన వారు నిర్దేశించిన ఆర్‌బీకేల్లో పొందవచ్చన్నారు. ఆయన వెంట వీఏఏలు జగదీష్, వాసు ఉన్నారు.

సంధి పోలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకలను జరుపుకుంటున్న గ్రామస్తులు

బలిజిపేట: చిలకలపల్లి, కూరుంపురం గ్రామస్తులు సంధి పోలమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. రెండు గ్రామాలకు చెందిన భూములలో నిర్మించిన ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కలశాలతో అమ్మవారిని పూజించారు. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పనివేళలు పాటించాలి



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

మక్కువ: వేతనదారులు పని వేళలు సక్రమంగా పాటించాలని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కన్నంపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరిష్ట వేతనం పొందేలా వేతనదారులు పనులు చేయాలన్నారు. పని ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మస్తర్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బద్రీనాథ్ బాధ్యతల స్వీకరణ



బద్రీనాథ్‌ను అభినందిస్తున్న ఎంపీడీవో

మక్కువ: మండల ప్రజాపరిషత్ కార్యాలయ పరిపాలనాధికారిగా బీవీఎస్‌కే బద్రీనాథ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

సీజ్ చేసిన వాహనాల వేలం రేపు

సాలూరు: పట్టణంలో పలు సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, వివిధ కేసుల్లో పట్టుకున్న టాటా ఏస్-1, టాటా మేజిక్ -1, కార్లు - 2, ఆటోలు - 2, టూ వీలర్స్ - 11 మొత్తం 17 వాహనాలకు వేలం వేయనున్నామని పేర్కొన్నారు. పట్టణ స్టేషన్లో నిర్వహించే ఈ వేలం పాటలో ఔత్సాహికులు పాల్గొనాలని సూచించారు.

ఎంపీడీఓగా రమేష్

పార్వతీపురం: పార్వతీపురం ఎంపీడీఓగా శంబంగి రమేష్ శనివారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పని చేసిన విజయలక్ష్మి బదిలీపై వెళ్లడంతో కొమరాడ ఎంపీడీఓగా బాధ్యతలను నిర్వహించిన రమేష్‌ను ఉన్నతాధికారులు పార్వతీపురం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేశారు.

‘జగనన్న సురక్ష’తో మరింత మేలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్:

జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మరింత మేలు జరగనుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సంక్షేమ పథకాలు ఇంకా అర్హులై పొందని వారుంటే వారిని గుర్తించి అందజేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన వినూత్న కార్యక్రమం జగనన్న సురక్ష అని పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో వలంటీర్లు, గృహ సారథులకు శనివారం జగనన్న సురక్షపై శిక్షణ ఇచ్చారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్య చెప్పుకున్న వారం రోజుల్లోనే 11 రకాల అత్యవసరమైన సేవలను ప్రజల సమక్షంలోనే పరిష్కరించనున్నట్టు తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి వినతులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాల్సిందేనని అన్నారు. చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తుందని, ఇంకా ఎవరైనా అందని వారుంటే వారికి కూడా అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు జె.శ్రీదేవి, మజ్జి నాగమణి, మోహర్ ప్రసాద్, చెవిటి వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో పాల్గొన్న అధికారులు, పార్టీ శ్రేణులు

మాదవ ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

సీతానగరం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ రేణుక ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్యపరమైన సమస్యలపై ఆయన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి పౌరులైన నేటి విద్యార్థులు ప్రభుత్వం విద్యాపరంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకొని మంచిగా ఎదగాలన్నారు. తల్లిదండ్రులు ఆశలు నెరవేరేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నాఉ. ఎన్ఎస్ఎస్ పీఓలు టి.రవికుమార్, డి.రామకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎ.శ్రావణ్‌కుమార్, జనార్దనరావు, అధ్యాపకులు ప్రసాదరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్

ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో నూతన కోర్సులు

సాలూరు: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుండి కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎమ్మెస్సీ కంప్యూటర్స్ ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీలో పొలిటికల్ సైన్స్ (మేజర్ హానర్స్), ఎకనమిక్స్ (మేజర్), బీకాం జనరల్(మేజర్), కంప్యూటర్ అప్లికేషన్ (మైనర్), బీఎస్సీ కెమిస్ట్రీ (మేజర్), ఫిజిక్స్ (మైనర్), జువాలజీ (మేజర్), బోటని (మైనర్), బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ (మేజర్), మేథమెటిక్స్ (మైనర్) ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలు కోరే విద్యార్థులు ఈ నెల 26 నుండి 30 వరకు తమ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పార్వతీపురం: మద్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి మద్యం బాటిళ్లను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. పార్వతీపురం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శనివారం దాడులను నిర్వహించగా పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై 250 మద్యం బాటిళ్లను (180ఎంఎల్) అక్రమంగా తరలిస్తున్న బొండపల్లి గ్రామానికి చెందిన కుమార్, సీతానగరానికి చెందిన రమేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు తదుపరి చర్యలు నిమిత్తం పార్వతీపురం రూరల్ ఎస్ఐ వై.సింహచలంకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం అక్రమంగా రవాణ చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి సంఘటనలు ఎక్కడ జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

వరాహ, నృసింహ అవతారాలలో జగన్నాథస్వామి

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు శనివారం స్వామివారిని వరాహ, నృసింహ అవతారాలలో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజాకార్యక్రమాలు జరిపారు. రోజువారీగా స్వామివారికి ప్రసాదాలతో నైవేద్యాలు సమర్పించారు. గుండిచా మందిరం వద్దకు గ్రామంలో భక్తులు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకున్నారు. భక్తుల చేత అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు.

నృసింహ అవతారంలో...

పార్వతీపురం టౌన్: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామి దశవతారాల్లో శనివారం గుడించా మందిరంలో హిరా పంచమి రోజున నృసింహ స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి పట్టణ గ్రూపు దేవాలయాల ఈఓ ప్రసాద్ ఆధ్వర్యంలో గుడించా మందిర ప్రధాన అర్చకులు రమేష్ పండా వేదమంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలతో పాటు రుత్వికులు శాంతి హోమాలు నిర్వహించారు. ఈ నెల 28న మారు రథయాత్ర జరుగుతుందని, గుడించా మందిరం వరకు జగన్నాథ, బలబద్ర, సుభద్ర దేవీల నుంచి ఊరేగింపుగా ప్రధాన ఆలయం వద్దకు తీసుకువచ్చి భక్తుల దర్శనార్థం ఉంచడం జరుగుతుందన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

క్రీడా పాఠశాలకు ఎంపికలు



ఎంపికలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: డా.వైఎస్సార్ క్రీడా పాఠశాల, కడపలో 2022 – 23 సంవత్సారానికి 4, 5 తరగతుల్లో ప్రవేశానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఎంపికలు నిర్వహించామని జిల్లా క్రీడల చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు అన్నారు. పార్వతీపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికలలో జిల్లా నలుమూలల నుండి 10 (బాలురు 5 + బాలికలు 5) మంది హాజరయ్యారు. ఎంపిక కార్యక్రమములో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి, ముఖ్య క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

ఎంపికలలో ప్రతిభ సాధించిన క్రీడాకారులను గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 29 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న పోటీలకు పంపనున్నట్టు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎంఈఓ - 1 పోస్టులు భర్తీ చేయాలి



విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సింహాచలం

పార్వతీపురం టౌన్: ఎంఈఓ – 1, జేఎల్ పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఏపీ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. విద్యా శాఖ కమిషనర్ పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించిన సందర్భంగా శనివారం ఆయనను కలిసి పలు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఎంఈఓ – 1 పోస్టులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరామన్నారు. ఇందుకు విద్యా శాఖ కమిషనర్ చాలా సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

- జూనియర్ సివిల్ జడ్జి విజయ్ రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.విజయ్ రాజ్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆయన సందర్శించి, అక్కడి మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం అక్కడి ఖైదీలతో మాట్లాడి, వారికి ఏవైనా సమస్యలుంటే అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందుబాటులో ఉండే న్యాయసేవలపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడుచే అవగాహన కల్పించారు. ఖైదీల ఆరోగ్యం బాగుండేలా చూడాలని, క్రమం తప్పకుండా వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ జోగులు, జైలు లీగల్ విజిటర్ ఎం.వెంకటేశ్వరరావు, న్యాయవాది ఎం.సతీష్ పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో భూముల రీసర్వే

పాలకొండ రూరల్: రైతుల సమక్షంలో భూముల రీసర్వే పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. స్థానిక పట్టణ పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వేను శనివారం పరిశీలించిన ఆయన భూ యజమానులు కూడా సర్వే జరుగుతున్న ప్రదేశానికి వచ్చేటప్పుడు భూములకు సంబంధించిన అన్ని వివరాలు తెలిపే పత్రాలను తీసుకురావాలన్నారు. సర్వేలో ఏవైనా తేడాలు వస్తే వాటిని వెంటనే పరిష్కరించుకోవచ్చన్నారు. రైతుల మధ్య ఎన్నో ఏళ్లగా నెలకొన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్ఓలు సాయిశ్రీనివాస్, రామారావు, సర్వేయర్లు గణేష్, మణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: జీఓ నంబరు 665తో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయాలకు ధూప దీప నైవేద్యాలకు రూ.5 వేలు మంజూరు చేయడం హర్షణీయమని ఆ సంఘం జిల్లా నాయకులు ముగడ జగన్మోహన్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కూరగాయల రంగా, ముగడ కేశవరావు, శంకర్రావు, ఈశ్వరరావు, పి.రమేష్ పాల్గొన్నారు.

ఇంటింట జగనన్న సురక్ష సర్వే



అంటిపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: రాష్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు ఇంటింట సర్వే నిర్వహించడం జరుగుతోందని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. అంటిపేటలో పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు ఆధ్వర్యంలో సర్వేను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, బగ్గందొరవలసలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ ఎన్వీ రమణ శనివారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ బగ్గందొరవలసలో పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించిన భోజన రుచులను పరిశీలించారు. విద్యార్థులకు సక్రమంగా భోజన సదుపాయం కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

అందరి సహకారంతో కుష్టు రహిత సమాజ నిర్మాణం



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న డీపీఎంఓ మూర్తి

సీతానగరం: కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని జిల్లా కుష్టు నివారణ ప్రాజెక్టు అధికారి మూర్తి పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ శిరీష, డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో కుష్టు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు, నివారణా చర్యలు అనే అంశంపై ఏఎన్ఎంలు, ఆశాలు, గ్రామ వలంటీర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కుష్టు నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ కుష్టు రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. పెదంకలాం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జి.సూర్యనారాయణ, పీహెచ్‌సీలకు చెందిన హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ అవ్వా తాతలకు ఆశా కిరణం

- జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్‌బాబు

పార్వతీపురం టౌన్: కంటి వెలుగు కార్యక్రమం అవ్వా తాతలకు ఆశా కిరణం అని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు అన్నారు. డా.వైఎస్సార్ కంటి వెలుగు నేత్ర పరీక్షలలో భాగంగా శనివారం పార్వతీపురం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వివేకానంద కాలనీ పరిధిలో వున్న వృద్ధులకు గతంలో నేత్ర పరీక్షలు నిర్వహించగా వారితో ఆయన మాట్లాడారు. గతంలో వైద్య పరీక్షలు చేయించుకోని వారికి మరల కంటి వైద్య శిబిరం నిర్వహించి వృద్ధులకు నేత్ర పరీక్షలు చేసినట్లు తెలిపారు. నేత్ర పరీక్షలు నిర్వహించి ఐదుగురికి కళ్లజోళ్లు, నలుగురికి కేటరాక్ట్ శస్త్ర చికిత్స కోసం గుర్తించి, వారికి రిఫరల్ చేసినట్లు ఇంకొంత మందికి సాధారణ చికిత్స చేసినట్లు తెలిపారు. ఈ నేత్ర పరీక్షలలో కళ్లజోళ్లల్ అవసరం అయిన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం పంపిస్తున్నట్లు తెలిపారు. చికిత్సలు అవసరం అయిన వారికి ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి నగేష్‌రెడ్డి, సహాయకులు ఉమా మాహేశ్వరి వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త దుర్గమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుకుమార్‌బాబు

‘జగనన్న సురక్ష’పై అవగాహన



గ్రామంలో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ స్థాయిలో అవగాహన తప్పనిసరి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమానికి ముందుగా ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు అంతా కలిసి ఇంటింటి సందర్శన చేసి కార్యక్రమంపై మండలంలోని పెద్దబొండపల్లి గ్రామంలో శనివారం అవగాహన కల్పించారు. వారందరినీ వ్యక్తిగతంగా ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకున్నారు. సమస్యలు చెప్పిన వారికి టోకెన్ అందజేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రజల నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తీసుకున్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.